# మల్లాది వెంకట కృష్ణమూర్తి

## మి నీ క థ

# "పె ళ్ళి చూ పు లు"

"సాయంత్రం కాలేజీ అయ్యాక మా ఇంటికోసారి రారాదూ?" అడిగింది మైథిలి తన స్నేహితురాలిని.

"వస్తాను."

"నీవుకూడా రావే" సౌమిత్రికి చెప్పింది మైథిలి.

"ఎందుకు?" అడిగింది సౌమిత్రి.

"టీకి"

"ఏదైనా అకేషనా?"

"అవును"

"పుట్టిన రోజా?"

"నాకు పెళ్ళిచూపులు."

చిన్నగా ఈల వేసింది సౌమిత్రి.

"కంగ్రాట్స్. కుర్రాడేం చేస్తున్నాడు?"

"ఉద్యోగం."

"ఆదేతేవే-ఏం వుద్యోగం?"

"ఆర్.టి.సి. లో"

"జిల్లా పరిషత్ హైస్కూల్ లో పనిచేసే సంబంధం ఏమైంది?"

"నీకెలా తెలుసు?"

"హైమని పిలిచావటగా రెండు నెలల క్రితం పెళ్ళి చూపులప్పుడు?"

"నీకు చెప్పిందా? రహస్యంగా వుంచమన్నానే?"

"నీనుంచి రహస్యంగానే వుంచింది— మన క్లాస్‌లో అందరికీ ఆ విషయం చెప్పిన సంగతి." నవ్వింది సౌమిత్రి.

"ఆ సంబంధం?" అడిగింది మైథిలి స్నేహితురాలు.

"థంబ్స్ డౌన్ ఎప్పటి లాగానే."

"కట్నం నచ్చలేదా?"

"నేను."

"హైమని పిలవటంలేదా ఈసారి?" సౌమిత్రి అడిగింది.

"ఊహు. చెప్పకు దానికి."

"ఎలా వుంటుందే పెళ్ళి చూపులు?"

"చూస్తావుగా రేపెప్పుడో నీకూ అనుభవం అవుతుంది. తప్పదు."

"నాది ప్రేమ వివాహం-నీలాగ కాదు."

"నిన్ను, నన్ను ఎవరు ప్రేమిస్తారే?"

"ష్! క్లాసులో వుంటే వుండండి లేకపోతే బయటకు వెళ్ళండి. ఏమిటా మాటలు పాఠం వినకుండా?" కోపంగా అరిచింది ఇంగ్లీష్ లెక్చరర్. మైథిలి, సౌమిత్రి, వాళ్ళ స్నేహితురాలివంక చూసి.

ముగ్గురూ వెంటనే పుస్తకంలోకి సీరియస్‌గా చూస్తున్నట్లు నటించారు.




'ఓడ్ టు ది వెస్ట్ విండ్' పద్యం కనపడింది వాళ్ళకి.

ం ం ం

సంవత్సరం మీద కొన్ని నెలలయ్యాక ఓ రోజు సౌమిత్రికి బెజవాడ రైల్వే స్టేషన్ లోని వెయిటింగ్ రూంలో కనపడింది మైథిలి.

"ఏమే ఎలావున్నావ్? కొడుకా?" అడిగింది సౌమిత్రి మైథిలిని చేతిలోని బిడ్డని చూసి.

"కాదు. కూతురు... ఏమండీ నా స్నేహితురాలు సౌమిత్రి తెలుసుగా?" అడిగింది మైథిలి భర్తని సౌమిత్రికి పరిచయం చేస్తూ.

"గుర్తులేదు." చెప్పాడాయన.

"నా పెళ్ళిచూపులకి సౌమిత్రి కూడా వచ్చింది. మర్చిపోయినట్లున్నారు."

"ఓ హో హో. అలాగా. గుర్తొచ్చింది." నవ్వాడాయన.

"ఎక్కడికి నువ్వు?"

"గుంటూరులో ఏదో వుద్యోగానికి ఇంటర్వ్యూవస్తే వెళ్తున్నాను."

"వుద్యోగం ఎందుకే హాయిగా పెళ్ళి చేసుకోక?" చెప్పింది మైథిలి.

"పెళ్ళి చూపుల్లో అన్నీ థంబ్స్ డౌన్ ఇప్పటిదాకా" విచారంగా చెప్పింది సౌమిత్రి.

"మీకో చిట్కా చెప్పనా? అడిగాడు మైథిలి మొగుడు సౌమిత్రిని.

"ఏమిటి? చెప్పండి."

"పెళ్ళి చూపుల్లో హైమలాంటి మీ కన్నా అందమయిన స్నేహితురాళ్ళనికాక మీ కన్నా అంద విహీనమయిన వాళ్ళని పక్కన వుంచుకోండి చాలు. మీరు బ్రహ్మాండంగా వుంటారు చూసేవాళ్ళకి."

"ఏమిటండి ఆ మాటలు?" చిరుకోపంగా అన్నది మైథిలి భర్తతో.

"నాకేం తెలుసు! ఇది నువ్వు ఆచరించిన వుపాయమేగా" మృదువుగా నవ్వాడు.★